క్లుప్తంగా

అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే చర్యలు

మల్దకల్: ఫర్టిలైజర్ షాపు యజమానులు ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని మండల వ్యవసాయాధికారి రాజశేఖర్ ఫర్టిలైజర్ షాపు నిర్వాహకులను హెచ్చరించారు. మంగళవారం మండలంలోని బిజ్వారంలో ఫర్టిలైజర్ షాపులను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఫర్టిలైజర్ షాపు నిర్వాహకులు, రైతులకు ఎరువులను విక్రయించిన వెంటనే రశీదులను ఇవ్వాలన్నారు. విత్తనాలు కొనుగోలు చేసే రైతులు తప్పనిసరిగా షాపు యజమానులతో రశీదులు పొందాలన్నారు. అంతకు ముందు ఆయన మేకలసోంపల్లి గ్రామాల్లో రైతులు నష్టపోయిన మిరప పంటను ఉద్యాన శాఖ అధికారి శ్రీనివాసాచారితో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో ఏఈఓ పల్లవి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సదరం క్యాంపును సద్వినియోగం చేసుకోండి

ధరూరు: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రతి బుధవారం నిర్వహించే సదరం క్యాంపును అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ ఎండీ జబ్బార్ ఒక ప్రకటనలో కోరారు. దివ్యాంగులు అర్హత సర్టిఫికెట్ కోసం, రెన్యూవల్ కోసం ముందుగానే మీ సేవ కేంద్రాల్లో స్లాట్ బుకింగ్ చేసుకుని సదరం క్యాంపులో హాజరుకావాల్సి ఉంటుందన్నారు. అర్హులైన వారందరూ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నిబంధనల మేరకు పనిచేయండి



అయిజ: పట్టణంలో చేపట్టిన అభివృద్ధి పనులను నిబంధనల మేరకు చేయాలని ఈఈ విజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం పట్టణంలో నిర్మాణంలోని వివిధ పనులను మున్సిపల్ కమిషనర్ నర్సయ్య, ఏఈ గోపాల్‌తో కలిసి ఈఈ విజయ్ కుమార్ సంతబజార్‌లో నిర్మిస్తున్న పార్కు, అంబేద్కర్ చౌక్‌లో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్, మాంస విక్రయశాల, ప్రధాన రహదారి మధ్యలో నిర్మిస్తున్న డివైడర్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఈఈ మాట్లాడారు. నాణ్యత ప్రమాణాలు పాటించాలని, సకాలంలో పనులు పూర్తిచేయాలని కాంట్రాక్టర్ వెంకట్రాములుకు పలు సలహాలు, సూచనలు చేశారు.

మార్లబీడులో రమాబాయి జయంతి



ధరూరు: మండల పరిధిలోని మార్లబీడులో మంగళవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తల్లి రమాబాయి అంబేద్కర్ జయంతి వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. మంగళవారం గ్రామంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద రమాభాయి చిత్రపటానికి సర్పంచ్ సుజాతమ్మ, దేవదాసు, మారెప్పలు పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, సవారప్ప, నాగన్న, ఎర్రన్న, యోహాను, రాజు, పరంజ్యోతి, ఎద్దుల రాజు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

చలో హైదరాబాద్ వాల్‌పోస్టర్ విడుదల



ధరూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ.. ఈ నెల 14న నిర్వహించతలపెట్టిన చలో హైదరాబాద్ వాల్ పోస్టర్‌లను బీఎంఎస్ మండల కన్వీనర్ విష్ణు ఆధ్వర్యంలో విడుదల చేశారు. మంగళవారం మండల కేంద్రంలో వారు కరపత్రాలతో పాటు వాల్ పోస్టర్లను విడుదల చేసి మాట్లాడారు. ధరూరు మండలం నుంచి సంఘటితంగా కార్మికులు తరలిరావాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లో నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయాలని కోరారు. ప్రతిఒక్కరూ స్వచ్ఛందంగా తరలిరావాలని కోరారు. ముఖ్యంగా పీఎస్‌యూ ప్రైవేటీకరణను నిలిపివేయాలని, అసంఘటిత కార్మికులందరికీ ఈఎస్‌ఐ అందించాలని, ప్రవేటు రవాణా వాహనాలకు ఇన్సూరెన్స్ 50 శాతం తగ్గించాలని, బీడీ పరిశ్రమలు కాపాడి బీడీ కార్మికులందరికీ రూ.1,000 పింఛన్ అందించాలని, తెలంగాణలో కనీస వేతనాల జీఓను వెంటనే సవరించాలని డిమాండ్ చేశారు.

కులాంతర వివాహాలకు ప్రోత్సాహకం

• ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి



కులాంతర వివాహం చేసుకున్న దంపతులకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి

గద్వాల రూరల్: కులాంతర వివాహాలకు ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి అన్నారు. గద్వాల పట్టణానికి చెందిన ఓ యువకుడు, పరుమలకి చెందిన ఓ యువతి కులాంతర వివాహం చేసుకున్నారు. దంపతులకు కులాంతర వివాహ పథకం ద్వారా ఒక్కో జంటకు రూ.2,50,000 మంజూరైన బాండ్లను జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు అండగా ఉంటుందన్నారు. ఆర్థిక ఇబ్బందుల నుంచి బయట పడడానికి ప్రోత్సాహకాలు అందజేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం అందిస్తున్న నగదుతో చిరు వ్యాపారాలను ఎంచుకుని జీవితంలో నిలదొక్కుకోవాలని సూచించారు. జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ అధికారి శ్వేత ప్రియదర్శిని, మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ జంబు రామన్ గౌడ్, వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ శ్రీధర్ గౌడ్, ఎంపీపీలు ప్రతాప్ గౌడ్, విజయ్, నజీమున్నీసా బేగం, జెడ్పీటీసీలు పద్మా వెంకటేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ..

తెలంగాణ స్టేట్ మైనార్టీ ఎంప్లాయిస్ సర్వీస్ అసోసియేషన్ నూతన సంవత్సరం 2023కు సంబంధించిన క్యాలెండర్‌ను మంగళవారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ఆవిష్కరించారు. అంతకు ముందు మైనార్టీ ఉద్యోగులు ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు.

సీఎం సహాయ నిధి గొప్పవరం

పేద ప్రజలకు సీఎం సహాయ నిధి గొప్ప వరమని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి అన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ కింద ధరూరు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే అందజేశారు.

కేవీపీఎస్ డైరీ ఆవిష్కరణ..

కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం(కేవీపీఎస్) నూతన సంవత్సరం 2023కు సంబంధించిన డైరీని మంగళవారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్, సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటస్వామి, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు మారెన్న, కార్యదర్శి రాజు తదితరులు పాల్గొన్నారు.

నిరాశకు గురిచేసిన రాష్ట్ర బడ్జెట్



మాట్లాడుతున్న మహేష్

అలంపూర్: భవిష్యత్తు రాజకీయ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వం వార్షిక బడ్జెట్ ప్రవేశపెట్టిందని బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు మహేష్ అన్నారు. అలంపూర్ చౌరస్తాలోని బీఎస్పీ ముఖ్య నాయకుల సమావేశం మంగళవారం నిర్వహించారు. సమావేశంలో నియోజకవర్గ అధ్యక్షుడు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజలను నిరాశకు గురి చేసిందన్నారు. బీఆర్ఎస్‌కు ప్రజల్లో విశ్వాసం కోల్పోయిందని చెప్పడానికి బడ్జెట్ నిదర్శమన్నారు. బడ్జెట్ ప్రసంగంలో ఆర్థిక మంత్రి పాత వాగ్దానాలను అబద్దాలతో కప్పి పుచ్చే ప్రయత్నం చేశారన్నారు. ప్రస్తుత సంక్లిష్ట పరిస్థితుల నుంచి ప్రజల దృష్టిని మరల్చేలా బడ్జెట్ రూపకల్పన చేశారన్నారు. పన్నులు దండుకోవడమే తప్ప సంక్షేమ పథకాలు, రాయితీలకు డబ్బులు ఖర్చు చేయలేదన్నారు. ప్రజలకు మేలు చేయడానికి బదులగా సంక్షేమ పథకాలు, సబ్సిడీలు లేకుండా చేశారన్నారు. ప్రభుత్వ విధానాలతో పేద రైతులు, కష్టజీవులపై ప్రభావం చూపేలా ఉందన్నారు. బహుజనులకు న్యాయం జరగాలంటే బీఎస్పీ అధికారంలోకి రావాలన్నారు. ఉమ్మడి జిల్లా మహిళా విభాగం కన్వీనర్ రాములమ్మ, నాయకులు సుంకన్న, శివ, ముప్పారపు తదితరులు ఉన్నారు.

ప్రజాసమస్యలు గాలికొదిలిన ప్రభుత్వాలు



మాట్లాడుతున్న మణికుమార్



దరూరులో పూలమాల వేస్తున్న నాయకులు

ఎర్రవల్లిచౌరస్తా: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒకరిపై మరొకరు నిందలు వేసుకుంటూ ప్రజా సమస్యలను గాలికొదిలేశాయని బీఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు మణికుమార్ అన్నారు. మంగళవారం ఇటిక్యాల మండలంలోని ధర్మవరంలో పార్టీ శ్రేణులతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు, కూలీల సమస్యలను అడిగి తెలుసుకుని మాట్లాడారు. ప్రజలను మభ్యపెట్టడానికే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎమ్మెల్యేల కొనుగోలు కేసులో డ్రామాలను ఆడుతున్నాయన్నారు. ఒకవైపు ప్రజలు సమస్యలతో కొట్టుమిట్టాడుతుంటే ప్రభుత్వాలు తమకేం పట్టనట్లుగా వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు. ప్రభుత్వాలకు కేసులపై ఉన్న ధ్యాస ఓట్లు వేసి అధికారం కల్పించిన ప్రజలపై ఎందుకు లేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు ప్రజల సమస్యలపై దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు తిరుపాల్, రాంబాబు, రాముడు తదితరులు ఉన్నారు.

ధరూరులో కోటి సంతకాల సేకరణ

ధరూరు: మండల కేంద్రంలో మంగళవారం బీఎస్పీ ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. బహుజన సమాజ్ పార్టీ గద్వాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ సీసల్ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో గ్రామస్తులు, యూత్‌తో కలిసి కోటి సంతకాల సేకరణ చేపట్టారు. అంతకు ముందు భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. బడుగు, బలహీన వర్గాల కోసం బీఎస్పీ పనిచేస్తుందని, ప్రతిఒక్కరూ బహుజన సమాజ్ వాద్ పార్టీని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో బీఎస్పీ ఉపాధ్యక్షుడు అల్వలపాడు గోపాల్, ప్రధాన కార్యదర్శి చింతరేవుల ముని, గద్వాల సవారన్న, మద్దెలబండ వెంకటేష్, ధరూరు నరేష్ పాల్గొన్నారు.

ధర్నాను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న గోవిందు

ధరూరు: సీడ్ పత్తి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ.. బుధవారం జిల్లా కేంద్రంలో నిర్వహించతలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని నడిగడ్డ హక్కుల పోరాట సమితి మండల అధ్యక్షుడు గోవిందు కోరారు. మంగళవారం ఆయన జిల్లా, మండల నాయకులతో కలిసి స్థానిక కార్యాలయంలో మాట్లాడారు. పత్తిని సాగు చేస్తున్న రైతులను గత కొన్ని దశాబ్దాలుగా మోసం చేస్తూనే ఉన్నారన్నారు. 2020–21 మరియు 2021–22 సంవత్సరానికిగాను ఫెయిల్ అయిన విత్తనాలను రీ శాంపిల్‌కు పంపించాలని డిమాండ్ చేశారు. జిల్లా చైర్మన్ గొంగళ్ల రంజిత్ కుమర్ ఆధ్వర్యంలో పాత బస్టాండ్ సర్కిల్‌లో నిర్వహించే ధర్నాకు రైతులు పెద్దఎత్తున హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు పరశురాముడు, రాము, శాంతన్న, జమ్మన్న, శివన్న, సత్యన్న, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్లు లేక అవస్థలు



తుమ్మిళ్లలో మట్టి రోడ్డు

రాజోళి: మండలంలోని పలు గ్రామాల్లో సీసీ రోడ్లు లేక పల్లె ప్రజలు అవస్థలు పడుతున్నారు. మండలంలోని తుమ్మిళ్ల, మాన్‌దొడ్డి, తదితర గ్రామాల్లో ఇప్పటికీ సీసీ రోడ్లు నిర్మించకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాకాలంలో చిన్నపాటి వర్షం కురిసినా, అడుగు ముందుకు వేయలేని దుస్థితి ఉంటుందని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని ప్రధాన రోడ్లు కూడా సీసీ రోడ్లకు నోచుకోలేని పరిస్థితి ఏర్పడిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. దుమ్ము ధూళి ఇళ్లలోకి చేరుతుందని వాపోతున్నారు. మరికొన్ని చోట్ల కుళాయిల ద్వారా వచ్చే నీరుతో పాటు దీనికి తోడు మురుగు అంతా రోడ్లపైకి వదులుతుండటంతో రోడ్డు మొత్తం బురదమయంగా తయారై, ఇక్కట్లు తప్పడం లేదు. కొన్ని ఏళ్లుగా గ్రామాల్లో సీసీ రోడ్లు పూర్తి స్థాయిలో నిర్మించలేదు. మరికొన్ని గ్రామాల్లో నాణ్యత లేని సీసీ రోడ్లు నిర్మించారు. కొన్ని గ్రామాల్లో సీసీ రోడ్లు మరమ్మతు నోచుకున్నా అధికారులు పాట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అన్ని గ్రామాల్లో మట్టి రోడ్ల స్థానంలో సీసీ రోడ్లు నిర్మించాలని కోరుతున్నారు.

ఆర్థికసాయం అందజేత



అయిజ: భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కొంత కాలంగా అనారోగ్యంతో బాధ పడుతుండటంతో ఆ సంఘం సభ్యులు మంగళవారం ఆర్థిక సాయం అందజేశారు. అయిజ పట్టణానికి చెందిన భవన కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు దేవసహాయం కొంతకాలంగా కిడ్నీల జబ్బుతో బాధ పడుతూ చికిత్స పొందుతున్నాడు. నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయన్ను సంఘం నాయకులు పరామర్శించి రూ.83,000 ఆర్థికసాయం చేశారు. మండలంలోని వివిధ గ్రామాల భవన నిర్మాణ కార్మికులతో పాటు పట్టణంలోని భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

యువకుడు అదృశ్యం

ఉండవెల్లి: మండలంలోని బొంకూరుకు చెందిన ప్రసాద్(17) కనబడటం లేదని తండ్రి రాముడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బాల్‌రాజు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం గద్వాలలోని పుటాన్‌పల్లెలోని టీఎస్ఆర్‌జేసి కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. అక్కడ కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో ఈ నెల 2న అతడిని అన్న బొంకూరుకు తీసుకొచ్చాడు. అక్కడి నుంచి ఆస్పత్రికి తీసుకెళ్దామని చూసేలోపు అక్కడి నుంచి అలంపూర్ చౌరస్తాకు గుర్తు తెలియని వ్యక్తుల బైక్‌పై వచ్చి, అక్కడి నుంచి ఎక్కడి వెళ్లాడో తెలియడంలేదన్నారు. తండ్రి రాముడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు.

కేసు నమోదు

గద్వాల క్రైం: పట్టణానికి చెందిన ఓ యువతి అదృశ్యమైన సంఘటన పట్టణ పోలీసుస్టేషన్‌లో చోటు చేసుకుంది. ఎస్ఐ అబ్దుల్‌షుకూర్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. పిల్లిగుండ్ల కాలనీకి చెందిన పుష్ప మూడు రోజుల కిందట ఇంటి నుంచి బయటకు వెళ్లింది. తల్లిదండ్రులు బంధువులు, స్నేహితుల వద్ద వాకబు చేయగా ఎలాంటి ఫలితం లేకుండాపోయింది. దీంతో మంగళవారం సాయంత్రం తండ్రి రాములు ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలియజేశారు.

యల్లందొడ్డిలో గుడిసె దగ్ధం



గట్టు: మండల పరిధిలోని యల్లందొడ్డిలో సోమవారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో గుడిసె దగ్ధమైంది. బాధితుల, గ్రామస్తుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కుమ్మరి తాయప్పకు చెందిన గుడిసెలో తాయప్పతో పాటుగా భార్య లక్ష్మి రాత్రి భోజనం చేసిన తర్వాత నిద్రకు ఉపక్రమించారు. అర్ధరాత్రి గుడిసెలో మంటలు వ్యాపించడంతో హుటాహుటిన భయంతో గుడిసెలోంచి బయటకు పరిగెత్తి ప్రాణాలను కాపాడుకున్నారు. విషయాన్ని గమనించిన చుట్టుపక్కల వారు క్షణ కాలంలో స్పందించి మంటలు పక్కనే ఉన్న ఇతర గుడిసెలకు వ్యాపించకుండా మంటలను అదుపు చేశారు. ప్రమాదంలో తాయప్పకు చెందిన గుడిసె పూర్తిగా దగ్ధం కాగా.. ప్రమాదంలో 2 క్వింటాళ్ల బియ్యం, వంట సామగ్రి, దుస్తులు, రూ.30 వేల నగదు అగ్నికి ఆహుతి అయినట్లు తెలిపారు. తాయప్ప కుటుంబ సభ్యులు వలస నుంచి 4 రోజుల కిందటే స్వగ్రామానికి చేరుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ప్రమాదంలో రూ.80 వేల వరకు ఆస్తినష్టం వాటిల్లినట్లు గ్రామస్తులు తెలిపారు. విషయం తెలుసుకున్న అధికారి శ్రీనివాసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలను నమోదు చేసుకున్నారు.

టీపీయూఎస్ డైరీ ఆవిష్కరణ



డైరీని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే డా. వీఎం అబ్రహం

అలంపూర్: అలంపూర్ చౌరస్తాలోని క్యాంపు కార్యాలయంలో టీపీయూఎస్ ఉపాధ్యాయ సంఘం 2023 డైరీని మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే డాక్టర్ వీఎం అబ్రహం హాజరై తపస్ ఉపాధ్యాయ సంఘం డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘం నాయకులు ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. వీరితోపాటు తపస్ జిల్లా అధ్యక్షుడు సుబ్బారెడ్డి, శ్రీనివాసులు, బస్వరాజు, మణిరాజు, రాజశేఖర్, మధు, మహేష్, నరేష్, లక్ష్మన్న ఉన్నారు.

కంటి పరీక్షలు చేయించుకోవాలి



మునుగాలలో ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు



పాల్వాయిలో వైద్యసిబ్బందితో డాక్టర్ నవీన్

ఎర్రవల్లిచౌరస్తా: ప్రభుత్వం చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని జెడ్పీటీసీ హనుమంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఇటిక్యాల మండలంలోని మునుగాలలో రెండో విడత కంటివెలుగు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి స్థానిక సర్పంచ్ కొప్పుల జయలక్ష్మితో కలిసి ఆయన హాజరై కంటి వెలుగును ప్రారంభించి మాట్లాడారు. తెలంగాణ అభివృద్ధిని కంటి చూపు లేని వారు కూడా చూడాలన్నదే ప్రభుత్వ ధ్యేయమన్నారు. ప్రజలంతా కంటి పరీక్షలు చేయించుకుని వారికి అవసరమై కంటి అద్దాలను ఉచితంగా తీసుకోవాలన్నారు. అనంతరం సర్పంచ్ మాట్లాడారు. రాష్ట్రంలో అంధత్వాన్ని నివారించేందుకే ప్రభుత్వం కంటి వెలుగును ప్రారంభించిందన్నారు. కార్యక్రమంలో నాయకులు కొప్పుల లక్ష్మీనారాయణరెడ్డి, చంద్రాస్‌రెడ్డి, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

మానవపాడు: మండలంలోని ఆయా గ్రామాల్లో అంధత్వం ఉన్న ప్రజలు ప్రతి ఒక్కరూ కంటివెలుగును తప్పక ఉపయోగించుకోవాలని డాక్టర్ రిజ్వానా తన్విర్ తెలిపారు. మంగళవారం మండలంలోని రెండో రోజు కంటివెలుగు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. 131 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా.. 13 మందికి కళ్లద్దాలు పంపిణీ చేశామన్నారు. 29 మందికి కంటి అద్దాల కోసం ఆర్డర్ పెట్టామని చెప్పారు. డాక్టర్ యాకుబ్‌బాష, కార్యదర్శి నాగరాజు, సిబ్బంది చంద్రన్న, రాణి, ప్రసన్న పాల్గొన్నారు.

అంధత్వ నివారణకు కృషి

కేటీదొడ్డి: అంధత్వ నివారణకు సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని ఎంపీపీ మనోరమ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కంటివెలుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపీపీ మనోరమ, వైస్‌ఎంపీపీ రామకృష్ణ నాయుడు హాజరై ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తహసీల్దార్ సుందర్ రాజు, ఎంపీడీఓ మోహమ్మద్ అజార్ మోహిద్దీన్, డాక్టర్ అశ్విని, చక్రధర్ పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

గట్టు: కంటి వెలుగు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని వైస్‌ఎంపీపీ సుమతి కోరారు. మంగళవారం లింగాపురంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని వైస్ ఎంపీపీ సుమతి, సర్పంచ్ సూర్యగౌడ్ ప్రారంభించారు. లింగాపురం, గట్టు గ్రామాల్లో కంటి పరీక్షలను కొనసాగిస్తున్నారు. వైద్యాధికారి శశికిరణ్, తిమ్మప్ప, సీహెచ్‌ఓ ఊసేని, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాల్వాయిలో..

మల్దకల్: మండలంలోని పాల్వాయి, మల్దకల్ గ్రామాల్లో కంటి వెలుగు కార్యక్రమం కొనసాగుతుంది. మంగళవారం ఆయా గ్రామాలకు చెందిన ప్రజలకు కంటి వైద్యులు పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రణీత మాట్లాడారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కంటి వెలుగు కేంద్రాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. కంటి పరీక్షల నిమిత్తం వచ్చే వారికి ముందగా పేర్లు నమోదు చేసుకొని వారికి టోకన్లు ఇవ్వడం జరుగుతుందన్నారు. డాక్టర్ నవీన్‌కుమార్, స్వరూపారాణి, సర్పంచ్‌లు శివరామిరెడ్డి, యాకోబు వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి



కేటీదొడ్డిలో మాట్లాడుతున్న శ్యామ్‌రావ్

కేటీదొడ్డి: బీజేపీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని జోగుళాంబ గద్వాల కో– కన్వీనర్ శ్యామ్ రావ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని బీజేపీ మండల అధ్యక్షుడు మహనంది రెడ్డి ఆధ్వర్యంలో మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. సమావేశానికి కో-కన్వీనర్ శ్యామ్‌రావ్ హాజరై మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం సామాన్యుడి నడ్డి విరిచిందన్నారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చేందుకు ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాలని, నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సి బాధ్యత మన అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు శ్రీపాదరెడ్డి, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

క్షేత్ర స్థాయిలో పార్టీ పటిష్టతకు కృషిచేద్దాం

గట్టు: బీజేపీని క్షేత్ర స్థాయిలో బలోపేతం చేయడానికి ప్రతి కార్యకర్త చిత్తశుద్ధితో కృషి చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు బల్గెర శివారెడ్డి కోరారు. మంగళవారం గట్టులో ఏర్పాటు చేసిన సమావేశంలో బల్గెర శివారెడ్డి మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా బీజేపీ ఈ నెల 10 నుంచి 25 వరకు స్ట్రీట్ కార్నర్ సమావేశాలను ఏర్పాటు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి గ్రామంలో ఈ సమావేశాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలో బీజేపీ మమేకం కావడానికి అవకాశం లభిస్తోందన్నారు. బీజేపీ కార్యకర్తలందరూ ఇందులో భాగస్వాములు కావాలని కోరారు. బుధవారం బల్గెరలో మండల స్థాయి బీజేపీ కార్యవర్గ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి బీజేపీ ముఖ్య నాయకులు హాజరుకానున్నారని, కార్యకర్తలంతా పెద్దఎత్తున తరలిరావాలని కోరారు. బీజేపీ నాయకులు మోహన్‌గౌడ్, రాజప్ప, నాగయ్య, ఆంజనేయులు, వెంకట్రాములుగౌడ్ పాల్గొన్నారు.


ఉపాధి ఉద్యోగులకు టైంస్కేల్ వర్తింపజేయాలి



వినతి అందజేస్తున్న ఉపాధి ఉద్యోగులు

గద్వాల న్యూటౌన్: సెర్ప్ ఉద్యోగుల మాదిరి తమకు టైం స్కేల్ వర్తింపజేయాలని జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ఉద్యోగులు కోరారు. ఈ మేరకు మంగళవారం అడిషనల్ కలెక్టర్ అపూర్వ చౌహాన్‌కు, డీఆర్‌డీఏ పీడీకు వేర్వేరుగా వినతిపత్రాలు అందించారు. గత అసెంబ్లీ సమావేశాల్లో కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరణ చేస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించారన్నారు. రెండు రోజుల కిందట జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ, సెర్ప్ ఉద్యోగుల పే స్కేల్ ఏప్రిల్ 2023 నుంచి అమల్లోకి వస్తుందని ప్రకటించారని తెలిపారు. ఈ ప్రకటనలో భాగంగా గ్రామీణాభివృద్ధి శాఖలో ఒక భాగమైన సెర్ప్ కాంట్రాక్ట్ ఉద్యోగులకు క్రమబద్ధీకరణ, పే స్కేల్ ప్రకటించి, అదే శాఖలో పని చేస్తున్న రెండో విభాగమైన జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కాంట్రాక్ట్ ప్రకటనలో స్థానం కల్పించలేదన్నారు. ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లోనే ఉపాధిహామీ ఉద్యోగులకు కూడా టైం స్కేల్ వర్తింపజేసేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణాభివృద్ధి శాఖలో 3,874 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులు వివిధ హోదాలో ఉన్నారని చెప్పారు. టైం స్కేల్ వర్తింపజేయకుంటే జేఏసీ తరపున నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామని వినతిలో పేర్కొన్నారు. ఎస్ఆర్‌ఈ జేఏసీ కన్వీనర్ ప్రసాద్, కోశాధికారి శివజ్యోతి, ఏపీఓలు, ఈసీలు, టీఏలు, కంప్యూటర్ ఆపరేటర్లు వినతిపత్రం అందించిన వారిలో ఉన్నారు.

రోడ్ల పక్కన గుంతలు పూడ్చండి



మానవపాడు: మండలంలోని మానవపాడు–చెన్నిపాడుకు వెళ్లే రహదారికి పక్కన మట్టిని తవ్వడంతో గుంతలు ఏర్పడ్డాయి. తీసిన మట్టిని రోడ్డుపై వేయడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ రహదారి గుండా మానవపాడు, చెన్నిపాడు, పెద్దపోతులపాడు మీదుగా ప్రతినిత్యం వాహనాదారులు రాకపోకలు సాగిస్తుంటారు. మట్టి గుంతలతో వాహనదారులు ప్రమాదాలబారిన పడే అవకాశం ఉందని ఆయా గ్రామస్తులు వాపోయారు. అధికారులు స్పందించి రోడ్డు కోతకు గురి కాకుండా గుంతలను పూడ్చివేయాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గద్వాల క్రైం: ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన మంగళవారం సాయంత్రం గంజిపేట కాలనీలో చోటు చేసుకుంది. గుర్తు తెలియని కారు డ్రైవర్ నిర్లక్ష్యంగా వాహనం నడుపుతూ గంజిపేట కాలనీ వైపు వస్తున్నాడు. అయితే కాలనీకి చెందిన గ్రేస్మమ్మ తన కుమారుడైన ప్రేమ్‌కుమార్‌ను తీసుకుని రోడ్డు సమీపంలో కిరాణానికి వెళ్తుండగా.. కారు డ్రైవర్ ర్యాష్‌గా వాహనం నడుపుతూ ఇద్దరిని ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు బాధితులను చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కారును వేగంగా నడుపుతూ క్షణాల్లో తప్పించుకుని పారిపోయినట్లు కాలనీవాసులు తెలిపారు.